క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ చేశారు.

బ్రహ్మోత్సవాల ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవారు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణి సమేత పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు అంకురార్పణ, 10 గంటలకు పంచామృతాభిషేకం, 10.30 గంటలకు ధ్వజారోహణం (గరుడపటం), రాత్రి 8 గంటలకు పల్లకి సేవ, 10 గంటలకు హరినామ భజనను నిర్వహించారు.

దేవుడిలా వచ్చి.. ప్రాణాలను కాపాడి..

- చిన్నారిని రక్షించిన గుర్తుతెలియని వ్యక్తి
- బ్రహ్మోత్సవాల్లో త్రుటిలో తప్పిన ప్రమాదం



బాణసంచా పేలుళ్లతో దగ్ధమవుతున్న ఆటో

బిట్రగుంట : కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మంగళవారం రాత్రి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదవశాత్తు బాణసంచా తరలిస్తున్న ఆటోలో మంటలు చెలరేగగా సమీపంలోనే ఉన్న భక్తులు వెంటనే అక్కడి నుంచి బయటపడగా ఓ చిన్నారి మంటలకు దగ్గర పడిపోయారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి దేవుడిలా వచ్చి చిన్నారిని కాపాడారు. భక్తుల కథనం మేరకు.. రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో కొండపైనుంచి ప్రసన్న వెంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరారు. అదే సమయంలో కొండ దిగువన మెట్ల మార్గం వద్ద బాణసంచా కాలుస్తుండగా ప్రమాదవశాత్తు అవి పక్కనే బాణసంచాతో ఉన్న ఆటోలో పడ్డాయి. దీంతో ఆటోలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్ద శబ్దంతో టపాసులు పేలాయి. వెంటనే ఆటో వద్ద నుంచి భక్తులు పరుగులు తీసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే ఆటో సమీపంలోనే ఒక చిన్నారి పడిపోగా గుర్తుతెలియని వ్యక్తి దేవుడిలా వచ్చి చిన్నారిని పక్కకు తీసుకువెళ్లి ప్రాణాలు కాపాడాడు. ఆటో డ్రైవర్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. కాగా ఆటోలో 30 నిమిషాలకు పైగా మంటలు చెలరేగాయి. అయినా మంటలను అదుపుచేసేందుకు ఫైరింజన్ మాత్రం రాలేదు. కొండదిగువన విద్యుత్ సరఫరాను నిలిపివేసి భక్తులే బకెట్లతో నీటిని తెచ్చి మంటలను అదుపు చేయాల్సి వచ్చింది.

సూర్యప్రభపై రంగడి విహారం



నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై ఉదయం.. హంసవాహనంపై రాత్రి విహరించారు. భక్తులు విశేషంగా హాజరై రంగడ్ని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా రంగాచారి వెంకటేష్, హేమ, కంచర్ల సతీష్‌చంద్రగుప్తా, మాలిని దంపతులు వ్యవహరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి సింహవాహన సేవ, చంద్రప్రభ ఉత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పోరుబాట

- కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు
- ఒత్తిడి చేస్తున్న కాలేజీల యాజమాన్యాలు
- తల్లిదండ్రుల ఆవేదన
- యువత పోరుకు మద్దతు

విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టనుంది. బుధవారం యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకులు చర్యలు తీసుకున్నారు.



నెల్లూరులో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు (ఫైల్)

పొదలకూరు: అధికారమే పరమావధిగా కూటమి పెద్దలు ఎన్నికల ప్రచారంలో అనేక హామీలిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సాకులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్నారు. కూటమి సర్కారు ఏర్పడి నెలలు గడుస్తున్నా ఏ ఒక్క పథకం అమలు చేయకపోగా పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరు గారుస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో ఉన్నత విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేసేవారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటి వరకు ఫీజుల చెల్లింపు విషయాన్ని పట్టించుకోకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ప్రధానంగా ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు కాలేజీల యాజమాన్యాల ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు.

సర్వేపల్లిలో..

యువత పోరుకు సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు మద్దతు తెలిపారు. బకాయిలతోపాటు కొత్తగా చెల్లించాల్సిన ఫీజులను కూడా కాలేజీ యాజమాన్యాలకు అందజేయాల్సిందిగా తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2019 – 2023 వరకు విద్యా దీవెన కింద 15,378 మందికి రూ.50.34 కోట్లు, వసతి దీవెన కింద రూ.14,097 మందికి రూ.83.27 కోట్లు అందజేశారు. నేడు ఇంజినీరింగ్ చివరి ఏడాది పూర్తి చేసుకోబోతున్న విద్యార్థుల పరిస్థితి ఘోరంగా ఉంది. వారు ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొంది ఉద్యోగావకాశాల కోసం అన్వేషించాల్సి ఉంది. అయితే కళాశాలల యాజమాన్యాలు ఫీజు బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలిక పెడుతున్నాయి.

ప్రభుత్వం ఫీజులు చెల్లించాలి



కూటమి ప్రభుత్వం వెంటనే విద్యార్థుల రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి. నా కుమార్తె ఇంజినీరింగ్ చివరి ఏడాది చదువుతోంది. ఫీజులు చెల్లించకుంటే సర్టిఫికెట్ల పంపిణీకి ఇబ్బందులు తలెత్తుతాయి. పంటల ఫలసాయం కూడా లేని కారణంగా మేం ఫీజులు చెల్లించే పరిస్థితి లేదు.

– వై.వెంకటేశ్వర్లురెడ్డి, మొగళ్లూరు, పొదలకూరు మండలం

ఇబ్బందిగా మారుతుంది



నా తల్లిదండ్రులు గ్రామంలో చిన్నపాటి టిఫిన్ అంగడి పెట్టుకుని జీవిస్తున్నారు. నేను వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో చివరి ఏడాది చదువుతున్నాను. ఫీజులు చెల్లించకుంటే సర్టిఫికెట్లు తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి.

– ఎ.విజయభాస్కర్, విద్యార్థి, బ్రహ్మదేవి, ముత్తుకూరు మండలం

కాలుష్యంతో పంటలకు నష్టం



తాళ్లపూడిలో మాట్లాడుతున్న మోహన్‌రావు

ముత్తుకూరు: ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్, కృష్ణపట్నం పోర్టు ద్వారా వెలువడే కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.మోహన్‌రావు విమర్శించారు. మండలంలోని తాళ్లపూడి పంచాయతీలో మంగళవారం జరిగిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూడిద, బొగ్గు దుమ్ము వల్ల జనజీవనం అస్తవ్యస్తమవుతోందన్నారు. విద్యుత్ బిల్లుల మోతకు పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. పరిశ్రమల కోసం సేకరించిన భూములు బీడు పడ్డాయన్నారు. పారిశ్రామికవేత్తలు ఈ భూములను అమ్మకాలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు మత్స్యకారేతర ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

పొదలకూరు: నెల్లూరు ఆర్డీఓ అనూషా మంగళవారం రీసర్వే జరుగుతున్న అయ్యగారిపాళెం గ్రామ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సర్వేను పూర్తి చేయాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ గోపీనాథ్ అయ్యగారిపాళెంలో 1,851.31 ఎకరాలున్నట్టు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖ పాల్గొన్నారు.

చలపతిరావును విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజా మద్దతుతో ఎదిగిన దళిత నేత వీరి చలపతిరావుపై మాట్లాడే స్థాయి లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు అనపల్లి ఉదయభాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. చలపతిరావుపై రాజా ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. అవినీతిని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక ఇలా మాట్లాడితే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. ఇలాంటి వారిని సమర్థిస్తే టీడీపీ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని చెప్పారు. పార్టీ యువజన విభాగ పట్టణాధ్యక్షుడు పాల్ విల్సన్, నేత మోర్ల భరత్‌కుమార్, చంద్రశేఖర్, దళిత నేతలు గంటా తిరుపాల్, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, డేవిడ్, కుప్పా పవన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

స్థాయి ఏమిటో తెలుసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొడవలూరు: డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావును విమర్శించే స్థాయి గరికపాటి రాజేంద్రకు లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. ఎదుటి వారిని విమర్శించే ముందు తమ స్థాయి ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. స్థాయి మరిచి విమర్శిస్తామంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పార్టీ ఎస్సీ విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు అనపల్లి ఉదయభాస్కర్, సర్పంచ్ మోచర్ల రమేష్, నేతలు తాటిపర్తి భాస్కర్, నెలవాయి మాణిక్యరావు, వీరి సురేష్, శ్రీకాంత్, అమరేంద్ర, కరేటి శ్యామ్‌సుందర్‌రెడ్డి, వీరి సంపత్‌కుమార్, సుధీర్ పాల్గొన్నారు.

రామావతారంలో ప్రసన్నుడు



రామావతారంలో హనుమంత వాహనంపై కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి

బిట్రగుంట : కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి రామావతారంలో మంగళవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవ కళతో ప్రసన్నంగా ఉన్న స్వామివారు రామావతారంలో హనుమంత వాహనంపై ఆలయ ముఖమండపంలో కొలువుదీరి భక్తులకు అభయం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సూక్ష్మబుద్ధి, అసమాన ఏకాగ్రత, అపరిమిత బలం, ప్రచండ వాయివేగం కలిగిన హనుమంతునిపై కొలువుదీరిన స్వామివారు అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలందుకుంటూ అర్ధరాత్రి దాటిన తరువాత ఊరేగారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయత్పూర్వం అర్చక బృందం సుప్రభాత సేవలతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్య పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నేడు

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగుర వేస్తామన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బీఈడీ పరీక్షలకు 86 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జరిగిన బీఈడీ పరీక్షలకు 86 మంది గైర్హాజరైనట్లు ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 1,212 మందికి గానూ 1,126 మంది హాజరైనట్లు తెలిపారు.

- వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం ఉదయం నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు 70 మందికి గానూ 57 మంది హాజరై 13 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 7,404 మందికి గానూ 6,972 మంది హాజరై, 432 మంది గైర్హాజరయ్యారని మధుమతి తెలిపారు.

గ్రామాల్లో ప్రచారం

పొదలకూరు: మండలంలోని తోడేరు, చాటగొట్ల, ఉలవరపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి వారు మంగళవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో సమితి మండల అధ్యక్షుడు జి.పెంచలనర్సయ్య, సభ్యులు కృష్ణయ్య, కొండయ్య, మధు, కిశోర్, పద్మమ్మ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరులో బుధవారం ఉదయం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి యువకులు, విద్యార్థులు తరలిరావాలని పార్టీ విద్యార్థి విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు జడ్డా సాయి కుమార్ మంగళవారం కోరారు. ఉద్యోగాలను కల్పించకుండా.. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను.. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెన బకాయిలను అందజేయకుండా విద్యార్థులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం

మనుబోలు: మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న విశ్వనాథస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. సూర్తాని కోటేశ్వరరావు – సుమలత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఉద్యోగ ఎంపికలు రేపు

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగ ఎంపికలను కియా మోటార్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నామని కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, డిప్లొమాలో ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ చదివిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మునునూరువారిపాళెంలో గ్రామసభ



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు: మండలంలోని మునునూరువారిపాళెంలో ఈ–పంట సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం గ్రామసభ జరిపారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ ఈ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను వెల్లడించి సవరణలుంటే తెలియజేయాలన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి, వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకూడదు



ఇందుకూరుపేట: సూచనలు చేస్తున్న శ్రీనివాసులు

ఇందుకూరుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని విక్రయించాలనుకునే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులతో రీషెడ్యూలింగ్ చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, కోఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ మహేష్, వ్యవసాయ సహాయకులు దీక్షిత, ఝాన్సీ, తిరుమల, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగం



పొదలకూరు: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శోభన్‌బాబు

- పొదలకూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉందని మండల ప్రత్యేకాధికారి శోభన్‌బాబు అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, మద్దతు ధరలకు సమానంగా మిల్లర్లు, దళారులు అందజేస్తే అమ్ముకోవాల్సిందిగా పేర్కొన్నారు. మండలంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ ఎ.వాసు తదితరులు పాల్గొన్నారు.
- మనుబోలు: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి ఆదుకునేందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఎంపీడీఓ జలజాక్షి, ఏఓ జహీర్‌తో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిల్లర్ల వద్ద సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

పింఛన్ల మంజూరుకు డిమాండ్



కొడవలూరు: యల్లాయపాళెంలో..



కోవూరు: సీపీఎం నేతల ఆందోళన

కోవూరు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లను మంజూరు చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పోతిరెడ్డిపాళెం సచివాలయం వద్ద ఆందోళనను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యుడు పెద్దబ్బాయి మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్లను అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన టీడీపీ.. అధికారంలోకి వచ్చాక ఆ అంశాన్నే విస్మరించిందని ఆరోపించారు. పక్కనే పెన్నా ప్రవహిస్తున్నా, పోతిరెడ్డిపాళెం తిప్ప వద్ద గిరిజన కాలనీలో తాగునీటి సమస్యలున్నాయని చెప్పారు. సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గండవరపు శేషయ్య, అఫ్రోజ్ అహ్మద్, నూకలపాటి మోహన, మణివర్మ, సురేష్, యస్దానీబాషా, ఊటుకూరు రమణయ్య పాకం శ్రీనివాసులు, రత్నమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసి విమర్శలకే పరిమితమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ ఆరోపించారు. మండలంలోని యల్లాయపాళెంలో ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్‌ను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మండలంలో ఇఫ్కో కిసాన్ సెజ్, మిథానీ పరిశ్రమ తదితరాలను పట్టించుకుంటే ఎంతో మందికి ఉపాధి కల్పించొచ్చన్నారు. నేతలు నరసింహం, దేవానంద్, నరసయ్య, కాంతారావు, నాగమ్మ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాలను విధిగా అమలు చేయాలి



మాట్లాడుతున్న జ్యోతి

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్దేశించిన కార్యక్రమాలను విధిగా అమలు చేయాలని కోవూరు సీడీపీఓ జ్యోతి పేర్కొన్నారు. పోషణ్ భీ.. పఢాయి భీపై స్థానిక జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఐదు రకాల అంశాల్లో పిల్లలను అభివృద్ధి చేయడంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ప్రీ స్కూల్ పిల్లలను అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదితో ఎస్సై అనుచిత ప్రవర్తన



మాట్లాడుతున్న న్యాయవాదులు

కోవూరు: న్యాయవాదితో కొడవలూరు ఎస్సై కోటిరెడ్డి అనుచితంగా ప్రవర్తించారని కోవూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సలీంబాషా, స్టాలిన్‌బాబు ఆరోపించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి మద్దతుగా వెళ్లిన న్యాయవాది చెన్నయ్యతో సదరు ఎస్సై దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. న్యాయవాదులు ప్రసాద్, వీరేంద్ర, సునీల్‌కుమార్, తిరుమలేష్, మధుసూదన్‌రావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల ఆక్రమణపై నిరసన



ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరులో శ్మశాన స్థల ఆక్రమణపై స్థానిక గిరిజనులు నిరసనను మంగళవారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ భూమిని 40 ఏళ్లుగా శ్మశానంగా వినియోగిస్తున్నామని చెప్పారు. బినామీ పేర్లతో స్థలాన్ని ఆక్రమించేందుకు చనుమూరు వెంకటేశ్వర్లు యత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వే నిమిత్తం మండల సర్వేయర్ రాగా, కోరిన వారెవరూ రాలేదని చెప్పారు. వెంకటేశ్వర్లు మాత్రమే రావడంతో బినామీ విషయం అర్థమవుతోందని తెలిపారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరారు. మండల సర్వేయర్ హరనాథ్‌ను అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిస్తానని ఆయన హామీ ఇచ్చారు.